(సీరియల్ కథ)

# మీరే... చెప్పండి.....!

★

రచన :
శ్రీ కె. బలరాంప్రసాద్.



[గతసంచిక తరువాయి]

వ్రాంచి మూడ్‌లో వుంది సినిమా. 'సీన్'లో ఒక మగధీరుడు ఒక అమ్మాయి ఛాతిని నీచంగా క్రూరంగా హింసించడంతో, ఆమె తోక త్రొక్కిన త్రాచులా లేచి బిగ్గరగా తిట్టటం ప్రారంభించింది. జతగా అలంకారయుతంగా బూతులే దిడుతోంది.

అక్కడి వారంతా గొల్లు మంటూ లేచి పోయ్యారు. బెంచీ కుర్చీల్లో వున్న వాటికి యింకేం వినిపించటం లేదు. కనిపించటమూ లేదు!

మాటా-మాటా పెరిగింది!

ఆడవాళ్ళంతా ఒక పార్టీ మగ వారలంతా మరో పార్టీగా తయారై, బలాబలాల్ని తేల్చుకోటానికి ముందు వాగ్యుద్ధమే తీవ్రంగా జరుపుకొంటున్నారు. ఇదేమిటని? అందరూ విసుక్కోవటమే గాని ఎవరూ అక్కడికి వెళ్ళలేదు.

తెరపై సినిమా నడుస్తూనేవుంది. ఒకవేళ ఆపినట్లయిన మహా ప్రమాదమని ఆపరేటరు ఫిల్మును కంటిన్యూ చేసేస్తున్నాడు.

'ఛాడ్డ మంద! ఏం పోయేకాలం ముంచుకొచ్చిందనీ?' అంటూ- వారిని సన్నగా తిడుతోంది పద్మ.

'అదే! చల్లబడుతోంది!' అనేసి సరోజ కుర్చీ మీదనుంచి జరుగుతూ, పద్మకు సమాధానం కావాలనే యిచ్చాడు కృష్ణ.

అప్పుడు-సరోజ ఛాతి, అతని భుజాన్ని స్పృశించి, అతనికెంతో హాయిని కలిగించింది.

కృష్ణ ప్రవర్తన పూర్తిగా చికాకు కలిగించింది సరోజకు.

'ఏమిటి తను? ఈ ప్రవర్తనేమిటి? అనేలా మనసులో విసుక్కుంటోంది ఆమె.

తనకేం పట్టనట్టువున్న పద్మపై ఆమెకు మిక్కిలిగా కోపం వచ్చింది.

పద్మతో ఏం చెప్పినా ప్రయోజనం లేదు. మొదటిలోనే విషయం యించుమించుగా తెలిపి పోయింది సరోజకు. ఎంత త్వరగా సినిమా పూర్తయితే అంత మంచిదని నిరీక్షిస్తోంది ఆమె. ఇంకా ఇంటర్వెల్ కూడా

యివ్వనే లేదు.

ఈ రాత్రంతా సినిమా వుండిపోతే ఎంత బావుం టోందో? అనుకొంటున్నాడు కృష్ణ. జవాబు దొరకని ఏదో తాత్కాలిక అనుభూతిని తన అజ్ఞానపు చేష్టల్తో అనుభవిస్తోన్నాడు అతను.

మరో అర్ధగంటలో తనువు చల్లారి పోయింది.

హాల్లో చాలా మంది ఎందుకొచ్చాంరా బాబు, ఈ వేళ! అంటూ వాపోతున్నారు.

ఈ రోజు సుదినం. అని వుప్పొంగిపోతోన్నాడు. గోదావరిలా కృష్ణ.

* * *

ఇంటర్వెల్ యిచ్చారు.

అందరూ హాలునుంచి బయటికి వస్తోన్నారు! సరోజ పద్మకు రెండు కూల్ డ్రింక్‌లను లోనికి పంపించి, తను మాత్రం వేడి 'టీ'ని త్రాగుతున్నాడు కృష్ణ.

'తీసుకో!' తనూ డ్రింక్‌ను తీసుకొంటూ అంది పద్మ.

'ఎక్కడిది? అమాయకంగా ప్రశ్నించింది సరోజ.

'డబ్బులేం తగలవులే! భరించే వాళ్ళే భరిస్తారు', మనొంతు త్రాగటమే?

'అంతా వింతగా వుంది' అంటూ కూల్ డ్రింక్‌ను తీసుకొని క్షణంలో త్రాగేసింది, చుక్క కూడా మిగల్చకుండా సరోజ. ఇంత వరకూ ఆమె కస్సలు డ్రింక్ అంటే ఏమిటో తెలియదు. ఇదే మొదటిసారిగా రుచి చూట్టం.

ఖాళీ సీసాల్ని 'బోయ్' కియిచ్చేశారు.

అప్రయత్నంగా కృష్ణ చేష్టల్ని వివరించి చెప్పింది సరోజ.

పద్మ ఏం తెలియనట్లు విని యిలా అన్నది!

'పోన్లేద్దూ!'

'అదేమిటి అలా అంటోన్నావు?'

'అతనెవరను కొన్నావు? మన వాడే!'

'అంటే ఎవరని నీ వుద్దేశ్యం?'

'మనవాడే! అతనేం చేశాడని? అసేం పట్టించుకోకు!'

'నువ్వేం అంటున్నావో అర్ధం కావటం లేదు పద్మా!'

'అలా అంటూ నా ప్రాణాలు తోడేస్తోంటావు'

సరోజకు-పద్మ ధోరణి వికారం అన్పించింది. మూర్ఖ్య, ముఖం తెలియని వ్యక్తిని అంతా గందరగోళం వ్యాపించింది సరోజలో!

'అయినా కృష్ణ చేశాడని అలా అయిపోతావు?'

అదోలా ముహం చిట్లిస్తో అంది పద్మ.

క్షణం ఆగి మళ్ళీ అంది.

'నువ్వెప్పుడూ యిల్లు కదలవు. నగర నీకేం తెలియవు మనిషికి మనిషి తాకినంత మాత్రాన నువ్వేం అరిగిపోతావా? లేక తరిగిపోతావా? నిజానికి మనమంటే అతనికెంత అభిమానం? టిక్కెట్లు కొన్నాడు. మన ఖర్చంతా పాపం! ఒక్కడే భరిస్తోన్నాడు. అంత మంచి వాణ్ణి నువ్వు ఏమీ అనకూడదు'

'పద్మ మంచి వాళ్ళంటే ఎవరు?' అడిగింది సరోజ.

చిక్కు ప్రశ్నరా బాబు! అని మనస్సులో ఒక కేక వినుక్కొంటూ-

'అదంతా తర్వాత చెప్తాను. అస్సలు నీకేం తెలియదు'

'పద్మా! అతని పూను మనకెందుకు? అతనెందుకు మన ఖర్చు భరించాలి?'

'దాన్నే 'ఖర్చ'ంటావు? మంచివాడు కాబట్టి అభిమానించి ఆదరిస్తోన్నాడు'

'నేను మాత్రం యిక్కడ కూర్చోలేను' దిగులుగా అంది సరోజ.

బుద్ధి గడ్డితిని నిన్ను తీసుకొచ్చాన'ంటూ విసువిసు పోయింది పద్మ.

గంట మ్రోగింది!

హాల్లో లైట్లన్నీ ఒకేసారి ఆరిపోయ్యాయి మామూలుగా వచ్చి కూర్చొన్నాడు కృష్ణ.

* * *

ఉద్యోగానికి పోక కులవృత్తి చెయ్యక తలిదండ్రులకు పెద్ద ముసప్పై కూర్చొన్నాడు కృష్ణ.

కొడుకు ప్రవర్తన వారికి పూర్తిగా తెలుసు. మరి

ధారిలో పెట్టాలని విశ్వ ప్రయత్నాలు చేశారు, చేస్తు న్నారు. ఇంతవరకేవీ ఫలించలేదు!

నిరాశ నిట్టూర్పుతో కాలాన్ని ఖర్చుచేస్తూ మనో వ్యథతో మంచం కూడా పట్టేదశ ఏర్పడిందా తలి దండ్రులకు.

ఇద్దరి కొడుకుల్లో చిన్నవాడు కృష్ణ. పెద్దవాడు 'కురుపాం'లో చింతపండు వ్యాపారం. అక్కడే స్థిర పడ్డాడతను. చదవనూ వ్రాయనూ మాత్రం వచ్చు కొంచెం కొంచంగా!

కృష్ణనైనా బాగా చదివించి, ప్రయోజకుణ్ణి చెయ్యా లన్న కాంక్షయం ఆ తలిదండ్రులకు బలీయంగా వుండేది! తమ శక్తి వంచన లేక శ్రమించి కొడుకు అడిగినది లేదన కుండా కాదనకుండా యిచ్చేవారు! యిచ్చేరు! ఫలితం ప్రస్తుతం అనుభవిస్తున్నారు.

తలోరకంగా వూర్లోవారు విమర్శలు, కుమారునిపై విసుర్తుంటే వాటిని వినే వోపిక లేక ఎదిరించే ధైర్యం చాలక, మనస్సులోనే బాధను దిగమ్రింగుతూ అన్నలు యిల్లే కదలటం మానేశారు తండ్రిగారు!

ఇంటి బాధ్యతను అప్పగిస్తే, చెడు స్నేహాలు చేసి చివరికి తండ్రి పరువును బజారుకు లాగాడు కృష్ణ.

పోనీ వివాహం చేసేస్తే బావున్నని ప్రయత్నాలు ఎన్నో చేశారు! చరిత్ర పుటల్ని అలంకరించిన హీరో కృష్ణకు, ఎవరూ తమ పిల్లల్ని యివ్వటానికి ముందుకు రాలేదు.

బంధువర్గాన్ని ఎంతో ప్రాధేయ పడ్డాడు తండ్రి. చివరికి తన కుమారుడు బాగు పడాలంటే వేరే గత్యం తరం లేదంటూ వీరి కాళ్ళుకూడా పట్టుకొన్నాడు!

'మా అమ్మాయి నిచ్చి కోరి, కష్టాల్ని తెచ్చుకో వటం మా కిష్టం లేదు! మీ వాడి బాగుకోసం మా అమ్మాయి జీవితాన్ని, నాశనం చెయ్యాలేం. చూస్తూ ఆ రొంపిలోనికి దించలేం! మీరు సాంప్రదాయ పరులు కావచ్చు! కాని మా పిల్లతో కాపురం చేసేది, మీ అబ్బాయి! అప్రయోజకుడికి కట్టబెట్టి మా పిల్ల గొంతును, మా చేతుల్లోనే నులిమే టంతటి మూర్ఖులం, అవి వేకం




ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్ వెల్

- జెట్ పంపులు -

రెండుస్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్ లో సాధారణ జెట్ పంపులకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును. ½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

:వివరములకు:

Grams: "NAIDUBROS" Phone: Office: 24997 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

M/s. Coimbatore Engineering Services, 139, Rastrapathi Road, Secunderabad - 3.

M/s. Sriram Enterprises, 13/85, Jayachamarajendra Road, Bangalore - 2.

కాద'ంటూ అందరూ కూడబలుక్కున్నట్లు, ఒకే సమాధానం యిచ్చారా తండ్రికి.

దానితో అతని హృదయం మరీ విచ్ఛిన్నమై పోయ్యింది! సముద్రంలా ఘోషిస్తోంది ఆ తండ్రి మనసు కన్నకొడుకును, తన ముందు అందరూ వ్రేలెత్తి చూపుతూ అనరాని మాటల్ని అంటోంటే, ఏం చెయ్యాలో తోచక ఆవేదనా భరితంగా తన స్థితిని వూహించుకోలేక కృంగి పోతోన్నాడు!

♦ ♦ ♦

చూశారా! అతని ఆరాటం! ఆవేదన! అసహాయత!

కృష్ణపై ఎన్నో ఆశల్ని పెంచుకొంటూ బ్రతికాడు. ప్రతి తండ్రీ-తల్లీ ఆశలు పెంచుకోవటం సహజం!

వారి ఆశలు అడియాశలుగా మారి పోయ్యినవాడు ఆ గుండెల్లో రగిలే వ్యధను వర్ణించ తరంకాదు!

కృష్ణ చరిత్ర హీనునిగా తయారైయ్యాడంటే తప్పు ఎవరిది?

తండ్రిదా? సమాజానిదా?

పిల్లలు ఏం కష్టపడిపోతారోనని వాళ్ళు కోరినవి, కన్నవారు యివ్వటమేనా చేసిన పొరపాటు? ప్రేమగా ముద్దుగా పెంచటంకూడా వారి తప్పిదమేనా? పిల్లలకు యిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకుంటే అది తలిదండ్రుల దోషమా?

పిల్లల పట్ల మమకారాన్ని పెంచిన పవిత్ర దంపతులకి వారు శాపాలుగా, పాపాలుగా పరిణమిస్తే పరితపించే వారు ఎవరు? తలిదండ్రులుకదూ!

వారి మనసుల్లో దాగివున్న భావాలకి సమన్వయం పడగల సంతానం ఎంత మంది? అనీ ప్రశ్నించి ఆలోచిస్తే సమాధానంగా వ్రేళ్ళమీద లెక్కించటమే! కాదంటారా? మీరే చెప్పండి...!

♦ ♦ ♦

పాపం! మనసంతా చికాగ్గానే వుంది మన హీరో కృష్ణకు. అందుచేత, చేతిన వున్న గడియారంను, అరవై రూపాయలకు తాకట్టు పెట్టి పాతిక రూపాయల విస్కీని త్రాగాడు! అయినా అతనికి చికాకు పోలేదు!

అనుకొన్నది సాధించే వరకూ కృష్ణకు చికాగ్గానే వుంటోంది!

పనికి మాలిన మిత్రులకు కొదవ లేదుగా? అలాంటి వారు ఎందరో వున్నారు కృష్ణకు.

అందరూ వూరికి చివరన వున్న మంచినీటి కోనేరు వద్ద కూర్చొని, ఎవరెవరేం ఘన కార్యాల్ని చేశారో వరుసగా ఒక్కొక్కటే చెప్పుకు పోతోన్నారు!

మరో అరగంటకు గానీ చీకటి పూర్తిగా రాదు, అనేలా వుంది ఆకాశంలో వాతావరణం.

♦ ♦ ♦

'నేను చెప్పింది పూర్తిగా విను' డిమాండ్ చేసేలా అంటోంది పద్మ.

'నువ్వెప్పుడూ, కృష్ణ గురించే చెప్తావు' విసుగ్గా అన్నది సరోజ.

'అదే నీకు వద్దుఅన్నాను! ముఖ్యంగా మన స్నేహాన్ని నీవు అర్థం చేసుకోలేక పోతోన్నావు! అసలు 'స్నేహం' అంటే ఏమిటో తెలుసా! ఒకరు చెప్పింది యింకొకరు వినటం!'

'నీ మాటలు ఏవీ నా బుర్ర కెక్కటం లేదు'

'చెప్పినంత మాత్రాన కొన్ని అర్థం కావులే, అనుభవించాలి, అలాంటి వాటిని! అప్పుడే ఆనందం హాయి, ప్రశాంతం వుంటాయి!'

'ఏమిటో అనుభవించటం?'

'నా మాట వింటానంటే చెప్తాను'

'చెప్పు మరి!'

'తర్వాత వినకుంటే?'

'అసలు విషయం చెప్పు. గందరగోళం పెట్టకు'

'ఏదీ వుండదు! తిని చూస్తే గాని, రుచి చెప్పలేం కదా! ప్రతిదీ అంతే!'

'నన్ను వెర్రెక్కించకు పద్మా!'

'ఔనా? యిది మరీ బావుంది నన్ను అడ్డంగా వుంచుకొని నీ కోరికను తీర్చుకోవాలని కూర్చొన్నావు' అంటూ ప్లేటు ఫిరాయించేసింది పద్మ.

(సశేషం)

★